ప్రజాశక్తి
గురువారం 9 అక్టోబర్ 2025
5
విజయనగరం



జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్‌గా వి.వి.సుబ్బారావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం - (గురజాడ, విజయనగరం) (జెఎన్‌టియుజివి) వైస్ ఛాన్సలర్‌గా వి.వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడలోని జెఎన్‌టియులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకట సుబ్బారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు.

సిజెఐపై దాడి దారుణం

- ఖండించిన న్యాయవాదులు
- విధులు బహిష్కరించి నిరసన



కోర్టు వద్ద నిరసన చేపడుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిశోర్ దాడికి పాల్పడటం దారుణమని, ఈ ఘటన హేయమైన చర్యని న్యాయవాదులు ఖండించారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా బుధవారం విజయనగరం కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవిబాబు ఆధ్వర్యాన న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై దాడిగా అభివర్ణించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్‌చేశారు. న్యాయ వ్యవస్థల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలను, నిబంధనలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెప్పారు. కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సిజెఐపై జరిగిన దాడి అత్యంత క్రూరమైనదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఆర్.సుశీల, గువ్వల తిరుపతిరావు, ఎ.అజయ్‌కుమార్, శంకరరావు, కె.సత్యప్రసాద్, ఎం.మురళీ, ఎ.అశ్వనికుమార్, డి.శ్రీరాములు, వై.హరికృష్ణ, పి.జనార్దనరావు, సిహెచ్ ప్రసన్నకుమార్, డాక్టర్ పైల రమేష్‌రాజు, జె ఎస్ఎన్ మూర్తి, కె.రోజా, టి.అనంతలక్ష్మి, రవి కుమార్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామికం

విజయనగరంటౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిశోర్ బూటుతో దాడి చేయడం అప్రజాస్వామికమని అంబేద్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి ఖండించారు. ఈ మేరకు బుధవారం టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో రాకేష్ కిశోర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో బుద్ధ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు పిడకల ప్రభాకర్ రావు, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి చిన్న అరుణ్ కుమార్, ధారన వెంకటేష్, మల్లన్న సత్యనారాయణ, ఆవాల నారాయణమూర్తి యాదవ్, పూసర్ల స్వాతి, లోపింటి రామకృష్ణ, చందక ఉమా మామహేశ్వరరావు, అన్వర్, వేమల వంశీ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజ్యాంగంపై దాడి చేయడమే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడటమంటే రాజ్యాంగంపై దాడిచేయడమేనని ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలుగు వెంకట్రావు ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సంఘటనకు కారణమైన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను బార్ కౌన్సిల్ నుంచి బహిష్కరించాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చీపురుపల్లి : సిజెఐ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నిరసన తెలియజేశారు. సామాజిక ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ గంటాన అప్పారావు మాట్లాడుతూ అత్యున్న న్యాయస్థాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యావత్ భారత దేశ న్యాయస్థానాలపై జరిగిన దాడిగా పరిగణించామని అన్నారు. ఈ దాడి క్షమించరానిదన్నారు. కార్యక్రమంలో ఎంపి రాజు, టొంపల సంజీవి, బూర సూర్యనారాయణ, యందవ పోలయ్య, బోడసింగి అప్పలరాజు, యు. రాము, దన్నాన రవి, ఎన్. దాసు పాల్గొన్నారు.

బస్సుల్లో కుమ్ములాటలు

- ప్రయాణికులకు తప్పనిపాట్లు
- గంటల తరబడి నిరీక్షణ



ఫుట్‌బోర్డుపై ప్రయాణాలు సాగిస్తున్న మహిళలు



బస్సు ఎక్కేందుకు గుమిగూడిన మహిళలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తిరుగు పయనమయ్యారు. దీంతో బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు కిటకిటలాడింది. ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసాయి. ఈ సందర్భంగా బస్సుల్లో ప్రయాణికుల మధ్య కుమ్ములాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని రూట్లలో బస్సుల సంఖ్య తక్కువగా ఉండటం, అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండటంతో ఒకరినొకరు తోసుకుంటూ కిక్కిరిసి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పండగ నేపథ్యంలో తగినన్ని బస్సులు ఏర్పాటు చేయడంలో ఆర్‌టిసి విఫలమైంది. దీంతో ప్రయాణికులు కాంప్లెక్సులో నిరీక్షించాల్సి వచ్చింది. ఆర్‌టిసి అధికారుల తీరుపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

11 రోజులు.. 10.15 కోట్ల వ్యాపారం

వృత్తిదారులను ప్రోత్సహించడమే సరస్ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

11 రోజులపాటు నిర్వహించిన అఖిల భారత డ్వాక్రా బజారు (సరస్)లో రూ.10.15 కోట్ల వ్యాపారం అయిందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సరస్ ముగింపు సభ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. 20 రాష్ట్రాల స్వయం సహాయక సంఘాలు పాల్గొన్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, వృత్తిదారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సరస్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాబార్డు, మెప్మా, డిఆర్‌డిఎ, రేస్, ఇతర బ్యాంకుల సహాయ సహకారాలతో నిర్వహించదచినట్లు తెలిపారు. ఉత్పత్తులను జిల్లా వాసులు కొనుగోలు చేసే విధంగా 43 మంది ఇతర రాష్ట్రాల వారితో ఒప్పందాలు చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

నేడు చలో నర్సీపట్నం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చలో నర్సీపట్నం కార్యక్రమానికి గురువారం కార్లతో తరలివెళ్తున్నట్లు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. బుధవారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం నర్సీపట్నం మెడికల్ కాలేజీని మాజీ సిఎం జగన్ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విజయనగరం నుంచి పెందుర్తి, రాంపురం వరకు కార్లతో భారీ ర్యాలీ నిర్వహించి, సంఘీభావం తెలియజేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు, రేపు ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో గురు, శుక్రవారాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాకు వస్తారని, ముందుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి.. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యాశాఖ అన్ని విభాగాల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు తాగటానికి వేడి నీరు మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు పరిశుభ్రంగా తయారు చేయాలని, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ప్రతిరోజు విద్యార్థులను పరీక్షించి సిక్ రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతిగృహ విద్యార్థులు, పోస్ట్ మెట్రిక్ కళాశాల విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఏ ఒక్కరికీ ఆరోగ్య సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో కూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్య తలెత్తినా సహించేది లేదని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా పిల్లలకు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందజేయాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి, డివిఇఒ, ఆర్ఐఒ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ అధికారులు, ఐసిడిఎస్ పీడీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

కంటోన్మెంట్ : నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా కలుషిత నీటివల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని చెప్పారు. నీరు మరిగించి తాగడం, భోజనం ముందు చేతులు కడగడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎవరైనా వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు గమనించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర పోటీలకు జొన్నవలస విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో జరిగే రాష్ట్ర బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలకు జొన్నవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్‌ఎం టి.విజయలక్ష్మి సంతోషం వ్యక్తంచేశారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.దేవమణి, ఎస్.విజయలక్ష్మిని హెచ్‌ఎం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలో రాణించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

కొనసాగుతున్న రద్దీ

సిరిమాను చెక్క కోసం ఎగబడుతున్న జనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ దర్శనం కోసం యాత్రికుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం భారీసంఖ్యలో జనం దర్శనానికి క్యూ కట్టారు. ఆలయానికి రెండు వైపులా ఉన్న క్యూలైన్లలో జనం వేచి ఉన్నారు. మరోవైపు ఘటాలతో మొక్కలు చెల్లించే భక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. సిరిమాను చెక్క కోసం ఎగబడుతున్నారు. చెక్కను ఇంటిలో ఉంచుకుంటే అన్ని రకాలుగా మేలు జరుగుతుందని ప్రజల నమ్మకం.



ఆలయం వద్ద జనాల రద్దీ



సిరిమాను వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

పైడితల్లమ్మ సిరిమానోత్సవం విజయవంతంగా పూర్తయిందని ఆలయ సహాయ కమిషనర్ కె.శిరీషా తెలిపారు. అమ్మవారి సిరిమాను సంబరాన్ని సంప్రదాయబద్ధంగా ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించాలి

ప్రజాశక్తి-పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం

జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించాలని ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్.. పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం పోలీసుస్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ల పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి, పోలీసుస్టేషన్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన వాహనాలను నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీసు సిబ్బందితో ఎస్‌పి మమేకమై, వారి వివరాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డయల్ 100/112 కాల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుఅందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువ సిసి కెమెరాలు అమర్చాలని, గస్తీ, జాతీయ రహదారిపై పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని చెప్పారు.



పూసపాటిరేగ పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న వివిధ కేసుల డైరీలను, రికార్డులను ఎస్‌పి పరిశీలించి, దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్‌పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐలు కె.దుర్గాప్రసాద్, జి.రామకృష్ణ, ఎస్ఐలు పాపారావు, సూర్యకుమారి, ఐ.దుర్గాప్రసాద్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్య, ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాలు, ఉన్నత విద్యా అభ్యసించడానికి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖతర్ దేశంలో దోహ నగరంలో హోం కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 40 ఏళ్లలోపు ఉండి, బిఎస్‌సి లేదా జిఎన్ఎం నర్సింగ్ విద్యార్హత కలిగి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.1.20 లక్షలు వరకు వేతనం, టాక్స్ ఫ్రీ జీతంతోపాటు ఉచిత వసతి, వైద్యం, రవాణా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ అక్టోబర్ 13గా పేర్కొన్నారు.

జర్మనీలో టెక్నీషియన్ ఉద్యోగాలు

జర్మనీ దేశంలో ఫిజియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు బిపిటి, ఎంపిటి, డిప్లొమా, డిగ్రీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ విద్యార్హత అవసరమని వివరించారు. ఫ్రెషర్స్‌కి నెలకు రూ.2.5 లక్షలు నుండి రూ.3 లక్షల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా జర్మన్ లాంగ్వేజ్ శిక్షణ పొందాల్సి ఉంటుందని, దీనికి మొత్తం రూ.లక్ష (ఎ1 నుండి బి2.2 లెవల్ వరకు) ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ అవకాశానికి రిజిస్ట్రేషన్ చివరి తేదీ అక్టోబర్ 15గా ప్రకటించారు.

రష్యాలో మెటలర్జీ కోర్సు

రష్యా దేశంలోని పర్వూరల్స్కి మెటలర్జికల్ కాలేజీలో మెటలర్జీ కోర్సులో స్కాలర్‌షిప్ ద్వారా చేరడానికి అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ కోర్సు వ్యవధి మూడేళ్ల ఆరు నెలలు ఉండగా, 18 నుంచి 21 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు, ఇంగ్లీష్ పరీక్షలో కనీసం 75 శాతం మార్కులు సాధించి, అనర్గళంగా మాట్లాడగలగడం అవసరమని చెప్పారు. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, వసతి ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు కూడా రిజిస్ట్రేషన్ చివరి తేదీ అక్టోబర్ 13గా నిర్ణయించారు.

ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్, విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలతో https://naipunyam. ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 94929 27844, 99663 36206, 83095 61123, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విస్తృతంగా సూపర్ జిఎస్‌టి ప్రచారం

సదరం క్యాంపులకు లబ్ధిదారు హాజరు తప్పనిసరి : కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ క్యాంపెన్‌లో విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజే పూర్తి చేయాలన్నారు. బుధవారం కలెక్టర్ సూపర్ జిఎస్‌టి క్యాంపెయిన్ , ఇ-క్రాప్ నమోదు, సదరం క్యాంపులపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టిపై పరిశ్రమల శాఖ ద్వారా ఎంఎస్ఎంఇలలో ఎగ్జిబిషన్లు నిర్వహించాలని తెలిపారు. సచివాలయాలతో మాపింగ్, షెడ్యూల్ చేయడం, డాక్యుమెంటేషన్, చేసిన కార్యక్రమాలను అప్‌లోడ్ చేయడం తప్పనిసరిగా చేపట్టాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఛాంపియన్స్‌గా ఉన్న సచివాలయ సెక్రటరీలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో సూపర్ జిఎస్‌టిపై అవగాహన తరగతులను నిర్వహించి, విద్యార్థులకు పోటీలను కూడా నిర్వహించాలని తెలిపారు. పోటీల వివరాలను, విజేతలు వివరాలను కూడా అప్లోడ్ చేయాలని తెలిపారు. వైద్య శాఖ ద్వారా ప్రైవేటు ఆసుపత్రుల వద్ద, ఫార్మా కంపెనీల వద్ద సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై పోస్టర్లు ఏర్పాటు, వర్క్‌షాపులు నిర్వహించడం చేయాలన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


ఇ-క్రాప్ నమోదు ఈ నెల 25 లోపల పూర్తి చేయాలని, అందుకోసం వ్యవసాయ అధికారులకు మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సహకరించాలని తెలిపారు. వ్యవసాయేతర, ప్రభుత్వ భూములన్నింటిని నమోదు చేయాల్సి ఉందని, ఈ విషయంలో రెవెన్యూ అధికారుల భాగస్వామ్యం ముఖ్యమైనదని అన్నారు.

సదరం క్యాంపులకు లబ్ధిదారు హాజరు తప్పనిసరి

వికలాంగ పెన్షన్ల పున:మూల్యాంకనలో భాగంగా, అర్హత తక్కువగా నిర్ధారించబడిన వారు అప్పీలు చేసిన సందర్భాల్లో వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సదరం శిబిరాలు ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఈ శిబిరాల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసిందన్నారు. అప్పీల్ చేసిన వికలాంగుల వివరాలను సంబంధిత ఆసుపత్రులకు మ్యాపింగ్ చేసి, ఎంపిడిఒ లాగిన్లలో నోటీసులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంపిడిఒలు తక్షణమే జిఎస్‌డబ్ల్యుఎస్ ద్వారా సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు తప్పనిసరిగా అందజేయాలని ఆయన ఆదేశించారు. క్యాంపునకు లబ్ధిదారు హాజరు కాకపోతే వారికి పింఛను అందే పరిస్థితి ఉండదని తెలియజేయాలన్నారు.

కంటి చూపే జీవితానికి వెలుగు

ప్రజాశక్తి-కంటోన్మెంట్



నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కంటి చూపే జీవితానికి వెలుగు. కళ్లు లేకుంటే జీవితమంతా అంధకారమయమే. మీ కళ్లు మీ జీవితానికి వెలుగును ప్రసాదించే అమూల్యమైన వరం. కంటి చూపే జ్ఞానానికి ద్వారం, ఆనందానికి ఆరంభం. రంగుల రమ్యత, ప్రకృతి సౌందర్యం.. ఇవన్నీ మనకు అనుభూతి చేయించేది కంటి దృష్టి. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా కళ్ల సంరక్షణపై ఒక లుక్కేద్దాం...

ప్రపంచంలో ప్రతి ఒక సెకండ్‌కు ఒక వ్యక్తి దృష్టి కోల్పోతున్నాడని మీకు తెలుసా! అదే విధంగా వివిధ కారణాలతో ప్రతి ఒక నిమిషానికి ఒక చిన్నారి చూపు కోల్పోతున్నాడు. 2022లో నిర్వహించిన జాతీయ సర్వే ఆధారంగా మన భారత దేశంలో జనాభాలో 0.36 శాతం మంది అంధులు ఉన్నారు. అంటే 49.5 లక్షల మంది అంధత్వంతోనూ, మరో 3.5 కోట్ల మంది దృష్టి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 80 శాతం అంధత్వం సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా నివారించ వచ్చు. ఒక వ్యక్తి అంధత్వం పొందడం వల్ల తలసరి స్థూల జాతీయ ఆదాయం రూ.1,70,624 నష్టం వాటిల్లుతుందని అంచనా.

కంటి సంరక్షణ కోసం అవగాహన కల్పించడం కోసం జాతీయ, అంతర్జాతీయ నేత్ర సంరక్షణ సంస్థలు ప్రతి ఏటా అక్టోబర్ రెండో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది ప్రపంచ దృష్టి దినోత్సవం థీమ్.. 'మీ కళ్లను ప్రేమించండి.. తద్వారా మీ కళ్లను సంరక్షించుకోండి'.

జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలో జిల్లాలోని ఆప్తాల్మిక్ ఆఫీసర్లు వారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన స్వచ్ఛంద నేత్ర ఆసుపత్రుల్లో కంటి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తున్నారు. ప్రజల్లో నిరంతరం నేత్రదానం, ప్రాథమిక నేత్ర సంరక్షణ అవగాహన కార్యక్రమాలను పాఠశాలల్లో, గ్రామాల్లో నిర్వహిస్తున్నారు.

మీ కళ్లను ఇలా పరిరక్షించుకోండి

మీరు, మీ చిన్నారులు పసుపు పచ్చని ఆకుకూరలు, కూరగాయలతో ఉన్న మంచి పోషకాహారం ఆహారంలో తరచుగా తీసుకోండి. మీకు గాని, మీ చిన్నారులకు గాని కంటికి గాయం తగిలినప్పుడు వెంటనే, నేత్ర వైద్య నిపుణులను సంప్రదించండి. సొంతవైద్యం చేయవద్దు. మీ చిన్నారుల్లో మెల్ల కన్ను, టోసిస్ గమనించినా వెంటనే నేత్ర వైద్య నిపుణులను సంప్రదించండి. అవసరం మేరకు మాత్రమే టీవీ, మొబైల్, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించండి.

– కె.త్రినాథరావు, మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఇఎస్ఐ మేనేజర్ జీవరత్నం

ఇఎస్ఐ చెక్కు అందజేత

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం కార్మిక రాజ్య బీమా సంస్థ ద్వారా బుధవారం ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ గంటి జీవరత్నం చేతుల మీదుగా ఇఎస్ఐ మృతి చెందిన కార్మికుల కుటుంబానికి చెక్కును పంపిణీ చేశారు. అయ్యన్నపేటలోని వసంత కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తూ 2024 జూలై 17న ఒరిస్సాకు చెందిన ప్రదీప్ రౌత్ అనే కార్మికుడు మృతి చెందాడు. ఆ కార్మికుని కుటుంబానికి నెలకు రూ.12వేలు పెన్షన్ మంజూరు అయిందని 14 నెల పెన్షన్ ఏరియర్స్ రూ.1.75లక్షలు వచ్చాయని బ్రాంచ్ మేనేజర్ జీవరత్నం తెలిపారు. ఆ నగదుకు సంబంధించిన చెక్కును అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేం పవర్ కాంట్రాక్టర్ సిహెచ్ రమణమూర్తి, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సూరిబాబును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

డైరెక్టర్‌గా సూరిబాబు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్ర నగరాల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిల్లా సూరిబాబు బుధవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. మండలంలోని రఘుమండ గ్రామానికి చెందిన సూరిబాబు గతంలో గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడుగా పోటీ చేశాడు. టిడిపిలో గత 20 ఏళ్ల నుంచి చురుగ్గా పనిచేస్తుండటంతో పార్టీ గుర్తించి ఈ పెదవి నియోజకవర్గ పెద్దల సహకారంతో ఇచ్చారు. సూరిబాబును మండలానికి చెందిన మాజీ పిఎసిఎస్ చైర్మన్ కలిదిండి ప్రదీప్ రాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ చీకటి సుహాసిని, నెల్లిమర్ల నియోజకవర్గం మహిళా అధ్యక్షులు చిల్ల పద్మ, జిల్లా నాగవంశం కన్వీనర్ ముని పైడయ్య, మండల మాజీ బీసీ సెల్ అధ్యక్షులు కోరాడ రమణ, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బుగత రమణ, నాయకులు సబ్బవరపు బుజ్జి, కరణం రమణ, కంది గంగాధర్ తదితరులు సూరిబాబును అభినందించి సత్కరించారు.

సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు సచివాలయంలో 2019 నుంచి 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సచివాలయం సిబ్బంది అంబటి దివాకర్, దమ్మంగి ప్రేమకుమార్, లాకేరి దుర్గాభవాని, కాపు సంతోష్ కుమార్, కందుల సన్యాసి రావు, ఆర్ సంతోష్ కుమార్, కనకరాజులను బుధవారం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజల ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి ఘన వీడ్కోలు పలికారు.



సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ దంపతులు

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, అవాస్తవాలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో ప్రభుత్వాలకు, రాజకీయాలకు, వ్యక్తిగతంగా తప్పుడు, అసత్య ప్రచారాలు చేస్తే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం సోషల్ మీడియాపై నిఘా పెంచామని, వ్యక్తుల గౌరవానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. గ్రామ పంచాయతీల్లో మద్యం బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, వేలంపాటలు వేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు తుపాకులు కలిగి ఉన్న వారు పోలీసులకు అప్పగించాలని, లేనిచో కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

శృంగవరపుకోట: జిందాల్ యాజమాన్యం కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఎటువంటి కంపెనీ కట్టకుండా జీవో నెంబర్ 14 ద్వారా భూమి వేరే అవసరాలకు బదలాయించి దోచుకోవడానికే కుట్ర పన్నిందని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆరోపించారు. బుధవారం బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు.

పారదర్శకంగా సబ్ ట్రెజరీ సేవలు

బొబ్బిలి: సబ్ ట్రెజరీ సేవలు పారదర్శకంగా అందిస్తున్నామని ఎస్‌టిఒ పివి పద్మనాభం చెప్పారు. స్థానిక సబ్ ట్రెజరీలో బుధవారం ఆయన మాట్లాడారు. పారదర్శకంగా సేవలు అందించడం వల్ల ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డులలో భాగంగా ఉత్తమ గవర్నెన్స్ అవార్డు ఇచ్చారన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సేవలు అందిస్తున్నామన్నారు.

ఆకులకట్ట సర్పంచ్‌కు సన్మానం

బొబ్బిలి: బాడంగి మండలంలోని ఆకులకట్ట పంచాయతీ స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక కావడంతో బుధవారం స్థానిక బుడా కార్యాలయంలో ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా ఆ గ్రామ సర్పంచ్‌ను సన్మానించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను కోరారు.

భారీ వర్షాలతో రైతులకు ఇబ్బందులు

గజపతినగరం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం ఎడతెరిపు లేకుండా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి పత్తి, వరి పంట రైతులు కొంతమేర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి చేను చిరు పొట్ట దశలో ఉండటంతో భారీ వర్షాలు కారణంగా పొట్టపై పువ్వు రాలిపోయే అవకాశం ఉందని, దీని ద్వారా దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు పడటం వల్ల ఎగువ ప్రాంతాల నీరు కంచిక పొలాల్లో చేరడం వల్ల ముంపునకు గురవుతున్నాయని మరి కొంతమంది రైతులు ప్రజాశక్తికి తెలిపారు. పత్తి పంటకు సంబంధించి అధిక వర్షాలు పడటంతో మొక్క నాని నేలకొరుగుతున్నాయని, మరికొన్నిచోట్ల ఇవక పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛాంధ్ర పాఠశాలగా మోడల్ స్కూల్

కొత్తవలస: మండలంలోని అర్దన్నపాలెం వద్దనున్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పాఠశాలగా ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి ప్రసన్న లక్ష్మీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ విజయనగరం కలెక్టర్ ఆడిటోరియంలో మంత్రులుమ అనిత, కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నామన్నారు. పిల్లలు తల్లిదండ్రులు సహకరిస్తే పాఠశాలను మరింత అభివృద్ధిలో తీసుకువెళ్తామని తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికవడంతో విద్యాశాఖ అధికారులు, స్కూల్ కమిటీ చైర్మన్ మల్లా రాము, వైస్ చైర్మన్ లంక గౌరీ, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బియ్యం బస్తాలలో తరుగు

- దోపిడీని అరికట్టాలంటున్న డీలర్లు
- కనీస వేతనం అమలు చెయ్యాలని డిమాండ్
- డోర్ టు డోర్‌కు వాహనాలు లేక ఇబ్బందులు
- నెల రోజుల పాటు రేషన్ పంపిణీ చేస్తున్నా తప్పని వేధింపులు

ప్రజాశక్తి- సంతకవిటి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎండియు వాహనాలను నిలిపివేసి డీలర్లకు బాధ్యతలను అప్పగించడం వల్ల డీలర్లు సంతోషం వ్యక్తం చేసినా అది ఎక్కువ కాలం నిలవలేదు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికీ వెళ్లి సరుకులు ఇవ్వాలని చెప్పడం దానికి అదనంగా ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో డీలర్లు ఆర్థికంగా చితికిపోతున్నారు. పైగా తమ దుకాణం వద్దకు వచ్చే సరకే బియ్యం బస్తాలలో తరుగు కనిపిస్తుందని ఒక్కో బస్తాలో రెండు నుంచి మూడు కిలోలు తక్కువ వస్తున్నదని దీంతో మరింత ఆర్థిక భారం తమపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి సరుకులు పంపిణీ చేసేందుకు వాహనాలు ఇవ్వడంతో పాటు ఎండియు వాహనాలకు ఇచ్చే విధంగా తమకు కూడా కనీస వేతనాలు ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు.

ఇటీవల కూటమి ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేసి, నేరుగా రేషన్ డీలర్ల ద్వారానే పంపిణీ చేయాలని ఆదేశించింది. దీనివల్ల రేషన్ డీలర్లకు పనిభారం పెరిగింది. ఎండియూ వాహనాలను తొలగించడంతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నికర లాభం వస్తున్నా డీలర్లకు అందులో సగమైనా కేటాయించాలని లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత ఖర్చులతో డీలర్లు అద్దె వాహనాలు పెట్టి వృద్ధులకు, వికలాంగులకు డోర్ టు డోర్ రేషన్ పంపిణీ చేస్తున్నారు. వినియోగదారులు తమ ఇంట్లో లేకపోతే మళ్లీ మళ్లీ వెళ్లడం మరింత భారంగా ఉందని వాపోతున్నారు. అధికారులకు వాహనాలు గూర్చి డీలర్లు అడిగితే నోరు మెదపడం లేదు. దీంతో చాలీచాలని గౌరవ వేతనంలోని డబ్బులు ఖర్చుయిపోగా తమ సొంత డబ్బులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్తాల్లో తరుగుతో మరింత ఇబ్బంది

బియ్యం బస్తాలు గోదాం నుంచి డిపోలకు వెళ్లే క్రమంలో బాగా బస్తాల్లో తేడాలు రావడంతో నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. 50 కిలోల బియ్యం బస్తాలో 46, 47, 48 కిలోల చొప్పున ఒక్కొక్క బస్తాలో బియ్యం తక్కువ వస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు. చిన్న డిపో డీలర్ నుంచి పెద్ద డిపో డీలర్లకు ప్రతినెలా 2 నుంచి 3 క్వింటాళ్లు తరుగు వస్తుందని, దీంతో చేతి డబ్బులతో బయట బియ్యం కొని వినియోగదారులకు పంపిణీ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్ మిల్లర్ల వద్దే మాయా జాలం జరుగుతుందని వాపోతున్నారు. ఈ దోపిడీని అరికట్టకపోతే భరించలేమంటున్నారు.

నెల రోజులూ పాటు పంపిణీ

15రోజులు వినియోగదారులకు పంపిణీ చేస్తున్న డీలర్లు మిగిలిన 15రోజులు వృద్ధులకు, వికలాంగులకు పంపిణీ చేస్తున్నారు. నెల రోజులు పాటు రేషన్ షాపులో ఉంటున్నా కనీస వేతనం అమలు చెయ్యడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కుటుంబ పోషణ మరింత కష్టంగా ఉందని డీలర్లు వాపోతున్నారు.

తరుచూ కొత్త నియమాలు

మండలంలోని 61 మంది డీలర్లు ఉన్నామని రేషన్ షాపుల్లో తరుచూ కొత్త నియమాలు, స్కీమ్‌లు తెచ్చి సరైన శిక్షణ ఇవ్వకుండా పని అప్పగిస్తున్నారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు పాటు రేషన్ పంపిణీ చేస్తున్నా, దుకాణం పై వచ్చిన చాలీచాలని కమిషన్ పై ఆదారపడి జీవనం సాగించడం మరింత భారంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సాంకేతిక సమస్యలతో డీలర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక సమస్యలతో ఆలస్యం కావడంతో వినియోగదారులు డీలర్లపై గొడవలకు దిగిన సందర్భాలూ ఉన్నాయని చెబుతున్నారు.



వృద్ధురాలి తంబ్ వేయించుకుంటున్న డీలర్

వారికి పంపిణీ కత్తిమీద సామే

65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు పంపిణీ సమస్య ప్రధానంగా ఉంది. దీనికి ప్రత్యేక సిబ్బంది అవసరం. అయితే వృద్ధులకు నేరుగా వారి ఇంటికి వెళ్లి పంపిణీ చెయ్యడం వల్ల శరీరకంగా, ఆర్థికంగా తట్టుకోలేని స్థితిలో ఉన్నారు. వృద్ధులకు రేషన్ పంపిణీ చేసేటప్పుడు డీలర్లు నానా అవస్థలుపడుతున్నారు. చివరికి డీలర్లే వినియోగదారులు ఇంటికి తీసుకునివెళ్తున్నారు. అయితే ప్రభుత్వం వాహనంలో పంపిణీ చేస్తామని చెప్పినా నేటికి అమలు కాలేదు. దీంతో డీలర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. డీలర్‌కు సపోర్ట్‌గా మరో సిబ్బందిని నియమించకపోవడంతో వృద్ధుల ఇళ్లకు శ్రమ ఎక్కువ అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి తన సొంత ఖర్చులతో ఆటోలో వృద్ధుల ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని పలువురు డీలర్లు చెబుతున్నారు. పని భారం పెరిగినా గౌరవ వేతనం పెంచక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఎండియు ఆపరేటర్లు మాదిరిగానే గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 65ఏళ్లు పైబడి ఉన్న డీలర్లు కూడా ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు సరుకులు పంపిణీ చెయ్యలేని పరిస్థితి ఉంది. అటువంటి డీలర్లకు హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, హెల్త్ చెకప్‌లు ప్రభుత్వం చెయ్యడం లేదు. తక్షణమే ఇటువంటి సమస్యలను పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డీలర్లు కోరుతున్నారు.

క్రీడల్లో కొట్టక్కి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో విజేతలుగా నిలిచారు. ఈ నెల 4,5వ తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా కేడీపేటలో 12వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో బాలికలు రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారు. సామిరెడ్డి వర్షిణి, కుమిలి మౌనిక, బత్తుల త్రిలోచనా షీల్డు, మెడల్స్ సాధించారు. వీరిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ వీరంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభ చూపిన గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు సందర్భంగా బుధవారం బొబ్బిలి ఆర్ఎస్ఆర్.రంగారావు కళాశాలలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీల్లో రామభద్రపురం గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. 7,8 తరగతుల విభాగాల్లో కోమలి ప్రథమ స్థానంలో నిలవగా, 9,10వ తరగతుల విభాగాల్లో వివిఎన్ ఛరీష్మా ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. వీరిని గ్లోబల్ పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ పోల చంద్రమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వైల్డ్ లైఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: వైల్డ్ లైఫ్ పోటీల్లో కొండగుంపాం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం విశాఖపట్నం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో వైల్డ్ లైఫ్ వీక్ సందర్భంగా ఈ నెల 2 నుంచి 8 వరకు జరిగిన వక్తృత్వ పోటీల్లో భాగంగా డ్రోన్లు, కెమెరా ట్రాప్ ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ పాత్ర అంశంపై కొండగుంపాం జడ్‌పి హై స్కూల్ విద్యార్థులు పతివాడ మేఘన ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం, డ్రాయింగ్ పోటీలో పతివాడ షర్మిల ద్వితీయ స్థానం సాధించారు. జీవ శాస్త్ర ఉపాధ్యాయులు సత్య ప్రకాష్ మార్గ దర్శకత్వంలో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా మేఘనను హెచ్‌ఎం వి.వేణు గోపాలరావు తదితరులు అభినందించారు.



మేఘన



పతకాలతో క్రీడాకారులు

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి కోరారు. పట్టణంలోని శివాలయం వీధిలో బుధవారం పోషణ్ మహా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీకుంటేనే ఆరోగ్యంగా ఉండగలరన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి రెండేళ్ల బిడ్డ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నివారణ సాధ్యమన్నారు. అంగన్వాడీ సరుకులు సక్రమంగా పంపిణి చేయాలని అంగన్వాడీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు దడ పుట్టించేలా సాంకేతికాభివృద్ధి

ప్రజాశక్తి -బొబ్బిలి

ప్రపంచ దేశాలకు దడ పుట్టించేలా ఇండియా సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక రాజా కళాశాలలో బుధవారం ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో మనుషులకు ఎటువంటి హానీ కలగకుండా సాంకేతిక నైపుణ్యంతో ఉగ్రవాదులపై మాత్రమే దాడి చేసినట్లు చెప్పారు. ప్రపంచ దేశాలకు ఇండియా సామర్థ్యం తెలిసిందని అన్నారు. దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందని విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఇస్రో చేపడుతున్న కార్యక్రమాలను ఎస్‌డిఎస్‌సి, ఎస్ఎంపిసి డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు వివరించారు. సాయంత్రం స్పేస్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బేబినాయన

స్పేస్ టూరిజం అభివృద్ధి దిశగా భారత్

భారతదేశం స్పేస్ టూరిజం అభివృది దిశగా అడుగులు వేస్తుందని ఎస్‌డిఎస్‌సి, ఎస్ఎంపిసి డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు అన్నారు. స్థానిక రాజా కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశం సాంకేతికంగా అతివేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌లో సామాన్య ప్రజలకు నష్టం జరగకుండా ఉగ్రవాదులను టార్గెట్ చేస్తూ దాడులు చేశామన్న, చంద్రుడుపై ల్యాండ్ అయ్యామన్నా అది సైన్స్ అండ్ టెక్నాలజీతోనే సాధ్యం అయిందని చెప్పారు. ప్రపంచ దేశాలకు ఇండియా ఎంత శక్తివంతమైందో నిరూపన అయిందన్నారు. టెక్నాలజీ అభివృద్ధిలో ఎన్ని ఎదురు దెబ్బలు తింటున్నామో గమనించి ఇతర దేశాలకు ధీటుగా సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అమెరికా నుంచి మిక్సర్స్ దిగుమతి చేసుకునే వారమని, అమెరికా మనకు ఇచ్చేందుకు ఇష్టం లేకపోవడంతో వాటి ధరలను పది రెట్లు పెంచడంతో మన సొంత టెక్నాలజీతో మిక్సర్లు తయారు చేసుకున్నట్లు చెప్పారు. స్పేస్ టూరిజం అమెరికాలో ఉందని, భవిష్యత్తులో భారతదేశం కూడా స్పేస్ టూరిజం దిశగా అడుగులు వేస్తుందని చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉణుకూరు గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ ముంజు జగన్ మోహన్‌రావు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని నిధులను దుర్వినియోగంపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎపిడి పి. చంద్రావతి గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలోని మరణించిన వారికి జాబ్ కార్డు ఇచ్చి డిమాండ్ ఐడిలో పనిదినాలు కల్పించారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అనర్హులను లబ్ధిదారులుగా చేర్చారని, చెల్లింపులపై అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్తుల నుండి వచ్చిన ఫిర్యాదును పరిశీలించి ఎపిడి స్థానిక సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, ఉపాధి వేతనదారులతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణ చేపట్టిన నివేదికలు జిల్లా అధికారులకు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు ఉంటాయని ఎపిడి తెలిపారు.



విచారణ చేపడుతున్న ఎపిడి చంద్రావతి

పైడిరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి - విశాఖపట్నం

గుండెపోటుతో ఇటీవల మృతిచెందిన ప్రజాశక్తి విజయనగరం జిల్లా కొత్తవలస మండల విలేకరి జి.పైడిరాజుకు ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎడివిటి స్టేట్ జనరల్ మేనేజర్ వై.తిరు పాల్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఘన నివాళ్లర్పించారు. బుధవారం ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా విలేకరుల వర్క్‌షాప్ జరిగింది. తొలుత పైడిరాజు చిత్రపటానికి శర్మ పూలమాల వేశారు. అనంతరం సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. పైడిరాజు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన విలేకరిగా, డివిజన్ ఆర్గనైజర్‌గా చేసిన సేవలను స్మరించుకున్నారు.



పైడిరాజు చిత్ర పటానికి పూలమాల వేస్తున్న శర్మ

నిబంధనలకు అనుగుణంగా పని చేయండి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నిబంధనలకు అనుగుణంగా అందరూ పని చెయ్యాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ పంచాయతీలకు రెవెన్యూ సమకూర్చే అంశంపై రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీలు స్వయం ప్రతిపత్తి గల సంస్థలు అని, స్వయంగా ఆదాయం సమకూర్చుకోవాలని అన్నారు. ఆదాయం లేక సర్పంచ్‌లు అప్పుల్లో పడిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. కార్యదర్శులు నిబంధనలకి అనుగుణంగా పని చేయాలని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన తెచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. మూలబొడ్డవరలో గ్రామ సభ పెట్టమని గ్రామస్తులు దరఖాస్తు ఇస్తే గ్రామ సభ పెట్టకుండా పై అధికారులకు లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. గ్రామసభలు గ్రామస్తుల సమస్యల కోసం అని, లేఖలు రాయడం జాప్యం చేయడం కోసమా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. గతంలో పెద్దఖండేపల్లి కార్యదర్శి గ్రామసభ ఎజెండా ఇచ్చి, గ్రామసభకి ఏర్పాటు చేసి, ప్రజలందరినీ పిలిచి ఆఖరి నిమిషంలో గైర్హాజరు అవడం ఎంత వరకూ సమంజసం అని ప్రశించారు. ఆశ్చర్యంగా ఈ మధ్య చూసిన గ్రామసభల్లో పోలీసులు హాజరై కేవలం ఎజెండా అంశాలు మాత్రమే చర్చించాలని ఆంక్షలు విధించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీలు దేశానికి పట్టు కొమ్మలు అని, గ్రామ పరిపాలనలో కార్యదర్శులది కీలక పాత్ర అని, గ్రామ పంచాయతీకి చాలా అధికారాలు ఇచ్చారు అని, వాటిని చక్కగా ఉపయోగించి గ్రామపంచాయతీలకి ఆదాయం సమకూర్చాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్ళకి తలొగ్గకుండా నిబందనలకి అనుగుణంగా పని చేయాలి అని సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ఫసల్ బీమాను వినియోగించుకోవాలి


ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలో ప్రతి ఒక్క రైతూ ఫసల్ బీమాను వినియోగించుకోవాలని తహశీల్దార్ యం.శ్రీను అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంట కాలంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ పథకం అమలు చేయడానికి ప్రధానమైన పద్ధతి పంట కోత ప్రయోగాలు ముఖ్యమన్నారు. ఈ పంట కోత ప్రయోగాలు ఏ విధంగా చేయాలని విషయంపై మండల అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నాయుడు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీటిలో ఎటువంటి తప్పిదాలూ లేకుండా ఈ పంట కోత ప్రయోగాలు చేసి దిగుబడిన అంచనా వేయడంలో ప్రధాన భూమిక వహించాలని ఆయన సూచించారు. పంట కాలానికి సంబంధించిన పంట నమోదు కార్యక్రమం కూడా ప్రతి ల్యాండ్ పార్సెల్స్‌ను కవర్ చేస్తూ శతశాతం పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ యం.శ్యాంసుందర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రం, బక్కు నాయుడుపేట ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూరిబా బాలికల వసతి గృహంను జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, స్టడీ మెటీరియల్ వివరాలు, స్టడీ అవర్స్ రోజువారి వివరాలు, విద్యార్థులను ఉపాధ్యాయులు దత్త తీసుకునే వివరాలు, ఎకనామిక్ స్టాండర్డ్స్, సిలబస్ కంప్లీషన్, విద్యార్థులు నోట్స్ కరెక్షన్, మొదలగు అంశాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, కస్తూరిబా బాలికల వసతి గృహం ప్రిన్సిపల్ కిరణ్మయి, వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యం నాయుడు

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి - గజపతినగరం

బొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడసింగిపేట సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లాన వేణు (29) అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఆర్‌టిసి బస్సు బైక్ పై వెలుతున్న యువకుడుని ఢీ కొనడంతో గాయపడినట్లు తెలిపారు. గాయపడిన యువకుడిది రామభద్రపురం మండలం కొండ కెంగువ గ్రామం అని చెప్పారు. బంధువు ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రైళ్లలో ప్రయాణికుల వద్దనుంచి బ్యాగులను దొంగతనం చేస్తున్న కోన గౌరీశంకర్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. గంట్యాడ మండలం కె.తామరాపల్లి గ్రామానికి గౌరీశంకర్ రైళ్లలో చోరీలకు పాల్పడేవాడు. ఎస్ఐ బాలాజీరావు సిబ్బందితో కలిసి విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద ఆయన్ను పట్టుకున్నారు. రూ.4 లక్షలు విలువైన 40 గ్రాముల బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపడి 14 మేకలు మృతి

- బాధితునికి రూ. 50వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుణ్యగిరి ఎంపిటిసి దార గిరికి చెందిన 14 మేకలు మంగళవారం రాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఈ దుర్ఘటనతో రైతు ఆవేదనను తెలుసుకున్న ఎమ్మెల్సీ బుధవారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి రూ.50 వేల సాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పశు సంపదే జీవనాధారమని ఈ ప్రాంతంలో చాలా మంది గిరిజన, హరిజన, వెనుకబడిన వర్గాల వారికి పశు సంపద ప్రధాన ఆదాయ వనరుగా ఉందని చెప్పారు. మేకలు, గొర్రెలకు సరైన బీమా సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సైక్లోన్ హెచ్చరికలు లేకపోతే బీమా వర్తించదని అధికారులు చెప్పగా, వాతావరణాన్ని అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రతి దుర్ఘటననూ పరిశీలించి, నష్టపోయిన రైతులకు తక్షణమే న్యాయం జరిగేలా ప్రణాళిక చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంతోషి, ఎంపిపి సోమేశ్వరరావు, గంగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లేగ దూడ మృతి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మద్దివలసలో విద్యుదాఘాతంతో లేగ దూడ (ఆవు దూడ) బుధవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన పాతర్లపల్లి మహేష్‌కు చెందిన ఈ దూడ గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేతకు వెళ్ళింది. అక్కడ కంచె పటిష్టంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.